# 'తూరుపు కథలు' ప్రారంభం!



"వీడు మళ్లీ దగా చేశాడు" మునసబుగారి ముఖం కందగడ్డ అయింది.

"వీళ్లెప్పుడూ ఇంతేనండీ. మొన్న కరణం గారింట్లో సీమంతాని కిలా అభాను చేయవు కదా! అని రొక్కించి మరీ అడిగానండి. నిన్న సాయంత్రం కూడా వస్తాననీ అన్నాడండీ."

ఒకటే ఆదుర్దా, ఇప్పుడేమిటీ సాధనం?

వంటవాడు దగా చేశాడు. ఒక్కరికా, ఇద్దరికా, ఊరందరికీ భోజనాలాయె. పైగా వియ్యాల వారి ముందు ఆయన పరువేం కావాలి? ఇన్నాళ్లకి కావరానికి వెళ్లిన పదేళ్లకి ఆయన గారాల పట్టి జానకి పండంటి బిడ్డను కన్నది. మునసబు గారబ్బాయి రాంబాబు తరువాత పద్దెనిమిదేళ్లకి ఆ ఇంట్లో వాడే తొలి నలుసు. అందుకే దౌహిత్రుని బారసాల మునసబు గారు అంత భారీ ఎత్తున చేస్తున్నారు. అటు వైపున కూడా వాడే తొలి మనవడు అవడం వలన వాళ్లూ బాగానే వచ్చారు బంధువర్గం.

"సాయపాల్లు జోగిరాజు, నన్నయ పంతులు వచ్చారండీ, అనలాడే వొంట్లో బాగోలేదని ప్రత్యూషాన లేచి పట్నం వెళ్లాడటండి. ముత్తైదువులు తలో చెయ్యి వేస్తే వాళ్లిద్దరూ ఉప్మా కలియబెట్టి ఫలహారం సిద్ధం అనిపించారండి" మునసబుగారు గంభీరంగా ఉండిపోయారు.

అప్పటికే కరణంగారు పరిస్థితి గమనించి క్రోసెడు దూరంలో గల కొండలగ్రహారంలో వంట మనిషిని బెత్తాయించమని సైకిలిచ్చి ఇద్దర్ని పురమాయించారు.

అదిగో అలాంటప్పుడు ఓ పెద్ద చత్రాం, అట్లకాడ గరిట కట్టగట్టి గదలా భుజాన వేసుకుని, వారగేచీపోసి కట్టిన నన్నంచు పంచెకట్టు, నడుముకు బిగించిన నాగుల గావంచా, వంటిపై విభూతి పిండి కట్లు, కుంకుడు గింజంత కుంకుమ బొట్టుతో "నిత్యానందకరీ వరా భయకరీ ... కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ" అంటూ అన్నపూర్ణ స్తోత్రం భక్తిపారవశ్యంతో, రాగయుక్తంగా, చిన్నగా పాడుకుంటూ వెళుతున్న పూర్ణయ్య అని పిలవబడే పప్పు అన్నపూర్ణయ్య సైకిళ్ల వాళ్లకళ్లపడ్డాడు. వెతుకబోయిన తీగ కాలికి తగిలినట్లయి, వాకబు చేస్తే "పారుగూరిలో గృహప్రవేశపు వంట ఒప్పుకున్నా వారింట పురుడవడం వల్ల తిరిగి వెళ్లిపోతున్నా"నన్నాడు.

ఇంకేముంది పూర్ణయ్య రావడం, గాడి పొయ్యి రాజెయ్యడం క్షణాల్లో జరిగిపోయింది. 'పట్టుమని పాతికేళ్లు లేని కుర్రోడు, ఇంత కార్యం గట్టెక్కిస్తాడా!' అని అనుమానమేసింది అందరికీ. ఇక ఆ రోజు వంట చూసుకోండి. దోసకాయ పప్పు, గుమ్మడికాయ కూరా, కంది పేపుడు, పూర్ణం కలిపిన ముక్కల పులుసు, మెంతి పోపు వేసిన కొబ్బరి కాయ పెరుగు పచ్చడి, పోలి పూర్ణంబూర్లు, పులిహోర, అబ్బా! అప్పడాలు, వడియాలు ఏం దోరగా వేగాయనుకున్నారు. అనలదేం రుచేగాని, పట్టెడన్నం తినలేని వాళ్లు కూడా సోలెడు బియ్యపన్నం పైనే లాగించేశారు. అయిదారు వందల మందికి చేసిన యత్నం నాలుగొందలపైచిలుకు తినేసరికే బొటాబొటిగా సరిపోయిందనిపించింది.

ఇక మిగిలిన వాళ్లు నౌఖర్లు, చాకర్లు అయినా అంతకు ముందే పరిస్థితి గమనించి, రెండు అనుకున్నా మూడు గుండిగల అన్నం, పప్పుచారు, వంకాయ ముద్దకూర పొయ్యెక్కించారు. ఇలా మధ్యాహ్నం మూడు గంటల దాకా ఊరందరికీ భోజనాలయ్యాక తామరాకులో గరిటెడు పులిహోరలో పెరుగు వేసుకుని ఓ రెండు బూర్లు నంజుకుని తృప్తిగా తిన్నాడు పూర్ణయ్య.

"అదేమిటయ్యా! అందరూ అంత ఇదిగా తిన్న నీ వంట ఇంత కొంచెం తింటున్నావ్?" అని మునసబుగారి ఇల్లాలు వర్ధనమ్మ గారడిగితే "పది మందీ తృప్తిగా తింటే నా కడుపు నిండిపోతుందమ్మా. నాకో పట్టెడన్నం చాలు" అని సవినయంగా చెప్పాడు పూర్ణయ్య.

అదిగో అలా మా వూరొచ్చిన పూర్ణయ్య మునసబుగారి బలవంతం మీద మా వూళ్లోనే ఉండిపోయాడు. పొరుగూర్లో ఉన్న పూర్ణయ్య తల్లిని రప్పించి, తల్లీ కొడుకులు ఉండటానికి మునసబుగారే వసతి కల్పించారు.

పూర్ణయ్య మంచితనం, కలుపుగోలుతనం వలన మా వూళ్లో అందరికీ తల్లో నాలుకైపోయాడు. ఎవరింట్లో ఏ కార్యం వచ్చినా, వన భోజనాలొచ్చినా, పూర్ణయ్యదే వంట. ఏ మవసరం వచ్చినా "మన పూర్ణయ్యకు కబురు చెప్పండి" - "మన పూర్ణయ్య ఉన్నాడు కదా ఇంకేం" అనేగాని "వంట పుట్టి", "వంట వాడు" అని అతన్ని ఎవరూ అనడం, వినడం జరగలేదు!

పూర్ణయ్య మంచితనం, వూరివాళ్లకి అతని పట్ల గల అభిమానం వలన మా వూరి పురోహితుడు శిష్లా సోమయాజులు తన కూతురు సుబ్బమ్మను పూర్ణయ్యకిచ్చి పెళ్లి చేశాడు. సుబ్బమ్మ బూరి బుగ్గలతో ముద్దొంకాయలా నిగనిగలాడుతూ మా పూర్ణయ్యకి వెన్నప్పంలా, నాజూకుగా ఉండేది. పూర్ణయ్య కూడా పెద్ద వాళ్లు దగ్గర లేకపోతే సుబ్బమ్మను 'వెన్నప్పం' అనే పిలిచేవాడు. వాళ్లిద్దరూ పప్పు, చింత చిగురులా కలిసిపోయారు. పూర్ణయ్యకి సుబ్బమ్మంటే ప్రాణం. ఎప్పుడైనా వంటకి సాయం వెళితే కూరలు తరగడం, పోపులు సర్దడం వంటి పై పనులే కాని పొయ్యి దగ్గరకు రానిచ్చేవాడు కాదు.

ఒక్కొక్క దాన్లో ఒక్కొక్కరి హస్తవాసి అద్వితీయంగా ఉంటుంది. నలుడు, భీముని మాట ఏమోగాని మాకు తెలిసినంత వరకు వంటలో పూర్ణయ్యదే పెద్ద పీట. "వుంభా పన్నపూర్ణేశ్వరి మన పూర్ణయ్య" అనే వారు మా తెలుగు మాష్టారు. పూర్ణయ్య పిండి వంట చేసినా, గుత్తొంకాయ కూరొండినా, అల్లంకారం, కొత్తిమీర పచ్చడి, కంది పప్పు పచ్చడి, పనస కాయ పప్పుకూర, అరటి దవ్వ ఆవ కూర, చివరికి నిమ్మకాయ పొక్కించినా, మావిడల్లం ముక్కవేసినా, అంతెందుకు పచ్చి పులుసు చేసినా, ఉప్పిండి చేసినా అదో అపురూపమైన వంటకం, అసలు మా వూరికి అతనో పెద్ద ఆస్తి.

ఒకసారి మా వూరు కేంపొచ్చిన దొరగారు పూర్ణయ్య చేసిన పాటోళీ తిని, తెగ మెచ్చుకుని కేరేజీడు పట్టుకు పోవడమే కాక పది రూపాయలు నజరానా ఇచ్చారు.

దొరగారు తన 'కేంప్ కుక్' గా సర్కారీ నౌఖరీ ఇస్తానంటే తను మా వూరు వదలి వెళ్లేది లేదని ఖచ్చితంగా చెప్పాడు పూర్ణయ్య.

మరోసారి రాత్రి బాగా పొద్దు పోయిన వేళప్పుడు మా వూరి మీంచి ఏనాళ్లకి తరలిపోయే పెళ్లి వారిని ఏరు అడ్డేసింది. సత్తో నావ పిల్లలతో రెండు బళ్ల జనం రాత్రి వేళ బసకి ఎవరింటికి పోతారు? చివరికి మునసబుగారి తలుపుతట్టి పరిస్థితి విన్నవించుకున్నారు. ఆయన వాళ్లందరినీ దేవాలయంలోకి చేర్పించి, పూర్ణయ్యని నిద్రలేపారు. అంతే అర గంటలో అన్నం, అరటి కాయ వేపుడు, పెసర పప్పు, కటిక పచ్చడి, చారు సిద్ధం! వొంటి పొద్దుల వాళ్లకి సొజ్జి సరేసరి. ఆ మాత్రం వంటకే అతిథులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. అందరి నోట ఒకటే మాట. ఏం వంట, ఏం రుచి,, వాళ్లు మా పొరుగూరి మొఖాసాదార్లు తమతో వాళ్ల దేవిడీకి వచ్చేస్తే రెండెకరాలు ఈనాం ఇస్తామన్నారు. 'అబ్బే మా వూరు వదిలి వెళ్లేది లేదన్నా"డు పూర్ణయ్య.

ఇలా పూచిన తంగేడులా మా మధ్య జీవితం గడిపిన పూర్ణయ్యకు పాపం వయసు మళ్లాకనే వొడుదుడుకులంటే ఏమిటో తెలిసింది. పెద్దతరం వెళ్లిపోయింది. రోజులు మారిపోయాయి. కుటుంబాలు చెదిరిపోయాయి. ఏ కార్యం జరిగినా పది మందినీ పిలవడం, వంటకి పూర్ణయ్యను బెత్తాయించడం తగ్గిపోయింది. ఎప్పుడైనా పెద్ద పెద్ద కార్యాలకు పూర్ణయ్యని పిలిచినా, "పూర్ణయ్య గారూ సరుకులు కాస్త తగ్గించి వేయండి", "పంక్తిలో బూర్లు బుట్ట ఒక్కసారి తిప్పితే చాలు" లాంటి మాటలు విని మనసు చివుక్కుమనిపించేది పూర్ణయ్యకు. "అలాగేనమ్మా" అని చెప్పినా లోలోపల చాలా మథనపడిపోయేవాడు. ఒకోసారయితే "పెద్దవాణ్ణి అయిపోయాను బాబూ" అంటూ వంటకి వొప్పుకునేవాడు కాదు.

ఇక తండ్రిలా వంటలు చేసో, తాతలా పౌరోహిత్యం చేసో గడవడం సాధ్యంకాదని పూర్ణయ్య కొడుకు విశ్వం, ఏదో చిన్న నౌఖరీలో కుదురుకుని చాలీ చాలని జీతంతో తినీ తినక సంసారాన్ని ఈడ్చేవాడు.

"వెన్నప్పం అదృష్టవంతురాలు! ఇవన్నీ చూడకుండా వెళ్లిపోయింది" అని కోడలితో వాపోయేవాడు పూర్ణయ్య. తన అవసాన దశలో పాపం పూర్ణయ్య తన కొడుకుతో - "ఒరే విశ్వం నేను చచ్చేలోపు మళ్లీ నిలువెత్తు అన్నపు రాశి చూడగలనంటావురా?" అనే వాడు. పది మందీ కడుపు నిండా తింటే సంతృప్తి పడడం తప్ప ఎప్పుడూ పట్టెడన్నం తినని పూర్ణయ్యకు చివరి రోజులలో పిడికెడు మెతుకులు కరువైపోయాయి.

"బాబూ! ఈ తరం వాళ్లు పది మందికీ సుష్టుగా భోజనం పెట్టే భాగ్యానికి ఎలాగూ నోచుకోలేదు. కనీసం వాళ్లైనా కమ్మగా వొండుకు తినే యోగం లేదు" అన్నాడు తన ఆఖరి ఘడియల్లో పూర్ణయ్య. ●









